సాక్షి
కర్నూలు
ఆదివారం । 11 । ఆగస్టు । 2024



ఎమ్మిగనూరులో హెల్మెట్ దొంగలు

ఎమ్మిగనూరు పట్టణంలో హెల్మెట్ ధరించిన దొంగలు దారిదోపిడీలకు పాల్పడుతున్నారు. ఇటీవల పాలవ్యాపారి బంగారు ఉంగరాలను దోచుకున్నారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,633
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:105.788
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:40,925
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:28,133



శ్రీమఠంలో నాగ సాధువులు

మంత్రాలయం : శ్రీ రాఘవేంద్రస్వామి దర్శనార్థం పలువురు నాగ సాధువులు శనివారం మంత్రాలయం వచ్చారు. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులను కలుసుకుని ఆశీర్వాదం పొందారు.

న్యూస్‌రీల్

ఎంపీడీఓలూ.. విధుల్లో చేరండి

కర్నూలు(అర్బన్): ఎన్నికల విధుల్లో భాగంగా ఇతర జిల్లాలకు వెళ్లి తిరిగి వచ్చిన ఉమ్మడి కర్నూలు జిల్లా ఎంపీడీఓలు వెంటనే విధుల్లో చేరాలని జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి ఆదేశించారు. పీఆర్ అండ్ ఆర్‌డీ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఇప్పటికే ఇతర జిల్లాలకు చెందిన ఎంపీడీఓలు జిల్లాలోని వివిధ మండలాల నుంచి రిలీవ్ అయ్యారని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలోనే జిల్లాకు వచ్చిన ఎంపీడీఓలు సంబంధిత ఈఓఆర్‌డీ/పర్యవేక్షకుల నుంచి చార్జ్ తీసుకొని సీటీసీని జిల్లా పరిషత్ కార్యాలయంలో అందించాలన్నారు. అనంతపురం, వైఎస్సార్ జిల్లాల నుంచి 40 మంది ఎంపీడీఓలు ఉమ్మడి కర్నూలు జిల్లాకు వచ్చారన్నారు.

రేపు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులను సమర్పించుకోవాలని సూచించారు. కార్యక్రమాన్ని కలెక్టరేట్‌తో పాటు అన్ని మండల, డివిజినల్, మునిసిపల్ కార్యాలయాల్లోనూ నిర్వహిస్తామని, ప్రజలు అక్కడ కూడా ఫిర్యాదులు అందించవచ్చన్నారు.

తుంగభద్రకు తగ్గిన వరద ప్రవాహం

కర్నూలు సిటీ: తుంగభద్ర నదిలో వరద ప్రవాహం భారీగా తగ్గింది. శనివారం ఉదయం 33,798 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉండగా, సాయంత్రం ఆరు గంటల సమయానికి 20,361 క్యూసెక్కులకు తగ్గింది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో తుంగభద్ర జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుకుంది. దీంతో డ్యాం గేట్ల ద్వారా వదులుతున్న నీటి ప్రవాహం మొన్నటి దాకా నదికి భారీగా వచ్చేది. అయితే రెండు రోజులుగా ఇన్‌ఫ్లో తగ్గింది. దీంతో దిగువకు నీటి విడుదలకు తగ్గిస్తూ వస్తున్నారు. సుంకేసుల నుంచి కేసీ కాలువకు 2,445 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

సెప్టెంబర్ 7 నుంచి గణేశ్ ఉత్సవాలు



సమావేశంలో గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులు

కర్నూలు కల్చరల్: వినాయక చవితి ఉత్సవాలు సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్ పేర్కొన్నారు. కర్నూలులో శనివారం సాయంత్రం కేంద్ర సమితి ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాలను ఆధ్యాత్మిక చింతనతో జరుపుకుందామన్నారు. ఆనవాయితీగా మూడు, ఐదు, తొమ్మిది రోజుల్లో నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి నగర అధ్యక్షులు డాక్టర్ మోక్షేశ్వరుడు మాట్లాడుతూ.. ప్రతి చోటా మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించాలన్నారు. పర్యావరణాన్ని కాపాడుకునేలా వేడుకలు జరుపుకుందామని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘ విభాగ్ కార్యవాహక్ రఘువీర్, ఉత్సవ సమితి జిల్లా కార్యదర్శి ఎండీవై జోగయ్య శర్మ, జిల్లా సహ కార్యదర్శి రంగస్వామి, నగర కార్యదర్శి జంపాల జనార్దన్, నగర సహ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ, కోడుమూరు ఉత్సవ సమితి ప్రతినిధులు కునిగిరి నీలకంఠ, నరసింహ, వీరాంజనేయులు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధిలో అక్రమాలకు హామీ!

- నిధులను కొల్లగొట్టేందుకు టీడీపీ నేతల కార్యాచరణ
- సీసీ రోడ్ల నిర్మాణాలకు గ్రీన్ సిగ్నల్
- థర్డ్ పార్టీగా వెండర్ రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న టీడీపీ శ్రేణులు
- ఇప్పటికే రూ.75 కోట్లతో ప్రతిపాదనలు
- ఫీల్డ్ అసిస్టెంట్లపై వేధింపులు.. 150 మంది వరకు రాజీనామా



2014- 2018 మధ్య టీడీపీ పాలనా కాలంలో నిర్మించిన చెక్‌డ్యామ్ దుస్థితి

కర్నూలు(అగ్రికల్చర్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులపై టీడీపీ నేతల కన్ను పడింది. అక్రమాలకు అడ్డుచెబుతున్న ఫీల్డ్ అసిస్టెంట్లు, సీనియర్ మేట్‌లపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. వారిపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. తీవ్ర స్థాయిలో బెదిరిస్తూ వారు వైదొలిగే విధంగా పావులు కదుపుతున్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తల వేధింపులు తాళలేక ఇప్పటికే జిల్లాలో 150 మంది ఫీల్డ్ అస్టిసెంట్లు రాజీనామా చేశారు. వారి స్థానంలో తమకు అనుకూలంగా ఉండేవారిని నియమించుకుంటున్నారు. అక్రమాలకు సహాయకారిగా ఉండే వారికి బాధ్యతలు అప్పగిస్తున్నారు.

అప్పట్లో ఇలా..

2014 నుంచి 2019 వరకు టీడీపీ పాలనా కాలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు మొత్తం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలోనే జరిగాయి. ఫీల్డ్ అసిస్టెంట్లు టీడీపీకి చెందిన వారే ఉండేవారు. ఎన్ఆర్‌ఈజీఎస్ నిధులు కేంద్రప్రభుత్వానికి చెందినవైనా తమవే అన్నట్లుగా ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. అప్పట్లో మెటీరియల్ కాంపోనెంటు కింద చెక్ డ్యామ్‌లు, గ్రావెల్ రోడ్ల నిర్మాణాలకు ప్రాధాన్యత ఇచ్చి అవినీతికి కొత్తభాష్యం చెప్పారు. పంచాయతీ రాజ్, నీటిపారుదల శాఖలతో పాటు వాటర్‌షెడ్ కార్యక్రమాల కింద 2014 సంవత్సరానికి ముందు చేపట్టిన పనులకు పైపై మెరుగులు దిద్ది కోట్ల రూపాయల 'ఉపాధి' నిధులు కొల్లగొట్టారు. నిధుల దుర్వినియోగాన్ని అరికట్టాల్సిన బాధ్యత ఏపీవో, ఎంపీడీవో, ఏపీడీలపై ఉన్నా...వారికి సైతం ముడుపులు ఇచ్చి అక్రమాలను పారించారు. అప్పట్లో ప్రతి ఏటా కరువు వచ్చినా.. కూలీలకు పనులు కల్పించకపోవడం గమనార్హం.

- అప్పట్లో (2014 నుంచి 2019 వరకు) ఉపాధి హామీ పథకం కింద జిల్లా మొత్తం మీద రూ.1,500 కోట్లు వ్యయం చేశారు. ఇందులో టీడీపీ నేతలు రూ.1,000 కోట్లకుపైగా స్వాహా చేయడం అప్పట్లో కలకలం రేపింది. డోన్, ప్యాపిలి, పత్తికొండ, కృష్ణగిరి, తుగ్గలి, వెల్దుర్తి, ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు, కోడుమూరు నియోజక వర్గాల్లో పాత పనులకు మెరుగులు దిద్ది... దొంగ మస్టర్లు వేసి నిధులను కొల్లగొట్టారు. ఉపాధి పనులకు రోజుకు 50 వేల మంది హాజరైతే 3 లక్షల మంది హాజరైనట్లు మస్టర్లు వేసిన రోజులు అనేకం ఉన్నాయి. అలాగే ఒక పనికి రెండు మండలాల్లో బిల్లులు చేసుకొని నిధులను కొల్లగొట్టారు. ఈ సంఘటనలపై క్రిమినల్ కేసులు కూడా నమోదయ్యాయి.

అవినీతిలోనూ పంపకాలు...

జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెల్లడైన మరుక్షణం నుంచే ప్రత్యర్థులపై దాడులకు తెగబడ్డ టీడీపీ నేతలు, కార్యకర్తలు చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతోనే అవినీతిపై దృష్టి సారించారు. జిల్లాలోని ప్రతి మండలంలో రెండు, మూడు గ్రూపులుగా విడిపోయారు. సంపాదన మార్గాలపై వీరిలోనే ఆధిపత్య పోరు నడుస్తోంది. పెద్దల సూచనల మేరకు కొందరికి డీలరు షిప్‌లు, మరికొందరికి ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులు, మరికొందరికి పొదుపు సంఘాలు, మిగిలిన వారికి మధ్యాహ్న భోజన ఏజెన్సీలు కట్టబెడుతున్నారు. ఆదోని నియోజకవర్గంలో బీజేపీ ఎమ్మెల్యే ఉండటంతో ఉపాధి నిధులు, ఇతర ఆదాయ వనరులపై ప్రస్తుత ఎమ్మెల్యే, టీడీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది.

ఇప్పుడు కూడా అదే బాట..

రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ఆదాయ వనరుగా మార్చుకునేందుకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. 'ఉపాధి' పనులన్నీ టీడీపీ నాయకుల ఆధ్వర్యంలోనే నిర్వహించడానికి ఫీల్డ్ అసిసెంట్లను మార్చుకుంటున్నారు. అదే విధంగా టీఏలు, ఈసీలు, జూనియర్ ఇంజినీర్లను కూడా తమకు అనుకూలమైన వారినే నియమించాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు.

- పత్తికొండ నియోజకవర్గంలో మద్దికెర, తుగ్గలి, పత్తికొండ, కృష్ణగిరి, వెల్దుర్తి మండలాలు ఉన్నాయి. ఈ నియోజకవర్గంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో సహా గతంలో పనిచేసినవారు ఎవరూ ఉండరాదనే లక్ష్యంతో టీడీపీ నేతలు ఉన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లతో బలవంతంగా రాజీనామా చేయిస్తున్నారు. టీఏలు, ఈసీలు, జేఈలను మార్పు చేయాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు.
- ఓర్వకల్లు మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంటుకు వైఎస్ఆర్‌సీపీ ముద్ర వేశారు. ఫోన్ ద్వారా బెదిరింపులకు పాల్పడ్డారు. రాజీనామా చేసి తప్పుకోకపోతే ఇబ్బందులు పడుతావని హెచ్చరించారు. అన్ని వైపుల నుంచి ఒత్తిళ్లు రావడంతో ఆయన రాజీనామా చేసి తప్పుకున్నారు.
- మెటీరియల్ కాంపోనెంటు కింద 'ఉపాధి' నిధులతో సీసీ రోడ్లు వేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. నియోజకవర్గాల వారీగా ప్రతిపాదనలు తీసుకుంటున్నారు. ఇప్పటి వరకు రూ.75 కోట్ల విలువ చేసే సీసీ రోడ్లకు ప్రతిపాదనలు వచ్చాయి. టెండర్లతో పనిలేకుండా సాగే ఈ పనులన్నింటినీ టీడీపీ నాయకులే చేపట్టనున్నారు. థర్డ్‌పార్టీతో వెండర్ రిజిస్ట్రేషన్ చేసి వారి ద్వారా పనులు చేయించేందుకు పక్కా ప్రణాళిక రూపొందించుకున్నారు. ప్రస్తుతం టీడీపీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల వారీగా థర్డ్ పార్టీగా వెండర్ రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. టీడీపీ నాయకులు సీసీ రోడ్లపై జాబితా ఇస్తే దానిని సంబంధిత అధికారులు ఎస్టిమేట్లు వేసి పంపుతున్నారు. రూ.2 లక్షల విలువ సీసీ రోడ్డుకు ఏకంగా రూ.4 లక్షల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు తయారు చేయిస్తున్నట్లు సమాచారం. మండలాల నుంచి వచ్చిన ప్రతిపాదనలకు పరిపాలనా అనుమతులు ఇచ్చేందుకు జిల్లా కలెక్టర్‌కు ఫైల్ పెట్టడానికి జిల్లా నీటి యాజమాన్య సంస్థ చర్యలు చేపట్టింది.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఇలా..

వైఎస్సార్‌సీపీ హయాంలో ఉపాధి నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు కళ్లకు కట్టినట్లు కనిపిస్తున్నాయి. అవినీతికి కేంద్ర బిందువులైన చెక్‌డ్యామ్‌ల నిర్మాణాలకు స్వస్తి పలికి మెటీరియల్ కాంపోనెంటు కింద గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలు, డిజిటల్ లైబ్రరీలు, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌లు, బల్క్‌మిల్క్ కూలింగ్ సెంటర్లు, సీసీ రోడ్లును నిర్మించారు. ఏ గ్రామానికి వెళ్లినా ఇవన్నీ కనిపిస్తాయి. ఉపాధి నిధులను సద్వినియోగం చేయడంతో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. మెటీరియల్ కాంపోనెంటు కింద చిన్న, సన్నకారు, ఎస్సీ, ఎస్టీ రైతులకు స్థిరాస్తి కల్పించాలనే లక్ష్యంతో పండ్లతోటలు అభివృద్ధి చేశారు. ఐదేళ్లలో కర్నూలు జిల్లాలో 11,374 ఎకరాలు, నంద్యాల జిల్లాలో 7,875 ఎకరాల్లో పండ్ల తోటలు అభివృద్ధి చెందాయి.

ఆరా తీస్తూ.. ఆట కట్టిస్తూ!

- నెల రోజుల వ్యవధిలో ఎనిమిది మంది 'ఖాకీ'లపై వేటు
- తాజాగా మహిళా ఏఎస్ఐ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన హెచ్‌సీపై చర్యలు

కర్నూలు: పోలీసులంటే క్రమశిక్షణకు మారుపేరు. అవినీతి, అక్రమాలపై ఉక్కుపాదం మోపడంలో వెనుకంజ వేయరు. ప్రజలకు భరోసానిచ్చి మార్గదర్శకంగా నిలిచే నేస్తం. అలాంటి పోలీసుల్లో కొందరి వల్ల ఆ శాఖకే చెడ్డపేరు వస్తోంది. వందల మంది ప్రయాణికులున్న కర్నూలు కొత్తబస్టాండ్‌లో విధి నిర్వహణలో ఉన్న ఓ మహిళా ఏఎస్ఐ పట్ల మద్యం మత్తులో పట్టపగలే దురుసుగా ప్రవర్తించిన హెడ్ కానిస్టేబుల్‌పై బదిలీ వేటు పడింది. ఈయన రెండున్నర సంవత్సరాలుగా కర్నూలు నాల్గవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. హైకోర్టు కేసు డ్యూటీ నిమిత్తం అధికారుల ఆదేశాల మేరకు విజయవాడకు వెళ్లేందుకు గత నెల 3న మధ్యాహ్నం బస్టాండుకు చేరుకున్నాడు. రిజర్వేషన్ కౌంటర్ వద్ద బస్సు వారెంట్ చూపించి రిజర్వేషన్ చేయించుకున్న తర్వాత అక్కడ విధుల్లో ఉన్న మహిళా ఏఎస్ఐ పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. బాధితురాలు రెండు రోజుల తర్వాత ఎస్‌హెచ్‌ఓకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో ఈ తతంగం వెలుగులోకి వచ్చింది. విషయం ఉన్నతాధికారులకు చేరడంతో ఎస్‌బీ విచారణ మేరకు హెడ్ కానిస్టేబుల్ మహబూబ్ బాషాను జిల్లా సరిహద్దులోని చిప్పగిరి పీఎస్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ బిందు మాధవ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన వ్యవహారంపై గతంలో పోలీసు స్పందన కార్యక్రమంలో కూడా పలువురు బాధితులు ఫిర్యాదు చేశారు.

నెల రోజుల వ్యవధిలోనే ఎనిమిది మందిపై వేటు

క్రైం పార్టీ ముసుగులో అక్రమాలకు పాల్పడినట్లు తేలడంతో కర్నూలు అర్బన్ తాలూకా, నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ, ముగ్గురు హెచ్‌సీలు, ఇద్దరు పీసీలపై బదిలీ వేటు పడి నెల రోజులు కూడా గడవకముందే తాజాగా మరో హెడ్‌కానిస్టేబుల్ సహోద్యోగిపై అసభ్యంగా ప్రవర్తించి శాఖాపరమైన చర్యలకు గురికావడం ఇప్పుడు పోలీసు శాఖలో చర్చనీయాంశంగా మారింది. గతంలో కూడా అనైతిక బంధం కారణంగా ఓ సీఐపై కూడా సస్పెన్షన్ వేటు పడిన అంశాన్ని ఈ సందర్భంగా పలువురు గుర్తు చేస్తున్నారు.

క్రమశిక్షణ లేని ఖాకీలపై ఆరా

పోలీసు శాఖకు అప్రతిష్ట తెచ్చేవారిపై కఠినంగా వ్యవహరించాలని ఆ శాఖ ఉన్నతాధికారులు నిర్ణయించుకున్నారు. జిల్లా పోలీసు శాఖలో హోంగార్డు నుంచి అధికారి వరకు వారి వ్యవహార శైలిపై ఆరా తీస్తున్నారు. పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ నుంచి సీఐ వరకు చాలా మంది వివిధ వ్యాపారాలు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ప్రైవేటు చిట్‌ఫండ్స్‌తో పాటు ఫైనాన్స్, వడ్డీ వ్యాపారాల్లో భాగస్వాములుగా ఉంటున్నారు. మరికొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారాల్లో తెరచాటుగా ఉంటూ దందాలు సాగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పేకాట ఆడుతూ పట్టుబడిన పోలీసులూ ఉన్నారు. అక్రమ సంబంధాలు కొనసాగిస్తూ రచ్చకెక్కుతున్న వారు లేకపోలేదు. తప్పులు చేస్తున్న వారిపై అధికారులు మౌఖికంగా ఆదేశాలు ఇస్తున్నప్పటికీ మార్పు కరువైంది. ఈ నేపథ్యంలో కట్టడి చేసేందుకు పోలీసు బాసు కార్యాచరణకు దిగినట్లు చర్చ జరుగుతోంది. ఇప్పటికే కొందరి జాబితా సిద్ధమైనట్లు సమాచారం.

విధి నిర్వహణలో అలసత్వాన్ని సహించం



హెడ్ కానిస్టేబుల్ మహబూబ్ బాషా బదిలీ వాస్తవమే. విధి నిర్వహణలో అలసత్వం, అవినీతి, అక్రమాలకు పాల్పడే పోలీసులపై చర్యలు తప్పవు. బాధితులకు న్యాయం చేయాల్సిన బాధ్యత పోలీసులపై ఉంది.

– జి.బిందు మాధవ్, ఎస్పీ

కొవ్వొత్తుల ప్రదర్శన



విజయవాడ నగరంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహంపై టీడీపీ శ్రేణుల దాడికి నిరసనగా శనివారం రాత్రి కల్లూరు అర్బన్ 33వ వార్డు పరిధిలోని ఇందిరమ్మ కట్ట దగ్గర వైఎస్సార్‌సీపీ నాయకులు కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

– కల్లూరు

జిల్లాలో తేలికపాటి వానలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో వివిధ మండలాల్లో తేలికపాటి వర్షాలు కురిశాయి. శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం ఉదయం వరకు ఆరు మండలాల్లో వానలు పడ్డాయి. అత్యధికంగా గూడూరులో 23.2 మి.మీ వర్షపాతం నమోదైంది. సీ.బెళగల్‌లో 9, కర్నూలు రూరల్ 7.6, కర్నూలు అర్బన్ 6.8, కల్లూరు 5.4, ఓర్వకల్‌లో 2 మి.మీ ప్రకారం వర్షాలు కురిశాయి. జిల్లా మొత్తంగా సగటున 2.1 మి.మీ వర్షపాతం నమోదైంది. ఆగస్టు నెల సాధారణ వర్షపాతం 116.2 మి.మీ ఉండగా.. మొదటి 10 రోజుల్లో 38.8 మి.మీ వర్షం కురిసింది. ఆగస్టు నెలకు సంబంధించి 67 శాతం లోటు వర్షపాతం ఉంది.

మద్దిలేటయ్య ఒక్కరోజు ఆదాయం రూ. 5.09 లక్షలు

బేతంచెర్ల: శ్రావణ మాసం మొదటి శనివారం సందర్భంగా మద్దిలేటయ్య క్షేత్రానికి భక్తులు పోటెత్తడంతో ఒక్క రోజు రూ. 5.09 లక్షల ఆదాయం లభించింది. జిల్లా నలుమూలల నుంచి స్వామి, అమ్మవార్ల దర్శనార్థం భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు చేసి స్వామి వార్లకు అభిషేకం, కుంకుమార్చన, స్వామి వారికి ప్రీతి పాత్రమైన వరపూజ, ఆకుపూజ, నిర్వహించారు. దీంతో రూ.5,09,000 ఆదాయం వచ్చినట్లు ఈఓ రామాంజనేయులు తెలిపారు.



ఆలయ ఆవరణంలో భక్తుల సందడి

ఒక వైపు చెంతనే తుంగభద్ర నది పరుగులు పెడుతున్నా.. మరో వైపు రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నా.. ఆలూరు నియోజకవర్గ ప్రజల తాగునీటి కష్టాలు ఎండాకాలాన్ని తలపిస్తున్నాయి. అటు అధికారులు.. ఇటు ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కొందరు కిలోమీటర్ల దూరం వెళ్లి వ్యవసాయ బోరు బావులను ఆశ్రయిస్తుండగా.. మరి కొందరు గ్రామాల్లోని ట్యాంక్‌ల వద్ద అరకొరగా వచ్చే ఉప్పు నీటితోనే గొంతు తడి చేసుకుంటూ నిత్యం తాగు నీటి కోసం తంటాలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి కష్టాలు తీర్చాలని ప్రజలు వేడుకుంటున్నారు.


పశ్చిమాన క'న్నీటి' కష్టం

- అడుగంటిన నీటి పథకాలు.. పట్టించుకోని అధికార యంత్రాంగం
- ఎండాకాలాన్ని తలపిస్తున్న ఆలూరు వాసుల నీటి కష్టాలు

ఆలూరు: వానాకాలమైనా నియోజకవర్గ ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా కురుస్తున్న భారీ వర్షాలకు ఆల్మట్టి, టీబీ డ్యాం, శ్రీశైలం డ్యాం, జూరాల, నాగార్జునసాగర్, గోదావరి నదులు పొంగిపొర్లి సముద్రంలోకి వృథాగా నీరు కలుస్తున్నా.. ఇక్కడి ప్రజలకు మాత్రం నీటి కష్టాలు తప్పడం లేదు. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో ఉన్న ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరు, పత్తికొండ, మంత్రాలయం నియోజకవర్గ ప్రజలకు టీబీ డ్యాం నుంచి హెచ్చెల్సీ, ఎల్లెల్సీలకు తాగు, సాగు నీటిని తుంగభద్ర బోర్డు అధికారులు విడుదల చేసిన సమయంలోనే తాగునీటి పథకాలను నింపుకుని.. అక్కడి నుంచి గ్రామాలకు సరఫరా చేసుకోవాలి.

ఆలూరు నియోజకవర్గంలో 11 నీటి పథకాలు

హాలహర్వి మండలం బాపురం గ్రామంలో 2, చింతకుంట గ్రామ సమీపంలో 2, ఖాజీపురం గ్రామసమీపంలో ఎగువకాలువపై 1, నేమకల్లు గ్రామం వద్ద 1, విరుపాపురం 1, హొళగుంద 2, ఎల్లార్తి 1, సమ్మత్తేరి 1 తాగునీటి పథకాలు ఉన్నాయి. వీటిలో ఖాజీపురం, నేమకల్లు గ్రామాల్లో ఉన్న నీటి పథకాలకు ఎగువ కాలువ(హెచ్చెల్సీ) నుంచి నీటిని పంప్ చేసుకోవాలి. అయితే ఈ కాలువకు ఎల్లప్పుడూ నీటి కొరత కారణంగా సంబంధిత అధికారులు తాగునీటిని నింపడంలేదు.



అడుగంటిన బాపురం గ్రామ రిజర్వాయర్



నీటికోసం సిద్ధేశ్వరనగర్ కాలనీవాసుల ఇక్కట్లు

రోజుకు వ్యక్తికి 40 లీటర్లు సరఫరా చేయాలి

పీఎస్ యాక్ట్ ప్రకారం ప్రతి వ్యక్తికి తాగునీటి అవసరాల కోసం రోజుకు 40 లీటర్లను సరఫరా చేయాలి. అది జరగడంలేదు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తాగునీటి సరఫరా కావడంలేదని వివిధ గ్రామాల ప్రజలు సంబంధిత అధికారులపై మండిపడుతున్నారు. ఇక్కడ నల్లరేగడి భూములు కావడంతో బోర్లు, బావుల్లోని నీటిని కూడా తాగే అవకాశం లేదు. దీంతో 1.50 లక్షల మంది తాగునీటికి టీబీ డ్యాం పైనే ఆధారపడి ఉన్నారు.

చర్యలు తీసుకుంటున్నాం

పైపులు పాతవికావడం, గొర్రెలు, మేకల కాపరులు పగలగొట్టడంతో కొన్ని చోట్ల తాగునీటికి సమస్యలు ఉన్నాయి. ఈ విషయం మా దృష్టికి వచ్చింది. నీటి సరఫరాలో అంతరాయం ఉన్న విషయం వాస్తవమే. తుంగభద్ర దిగువ కాలువ నీటిని పంపింగ్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– మల్లికార్జునయ్య,
ఆలూరు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ

గుక్కెడు నీరు కరువాయె



ఇప్పటికీ సరైన వాన లేవ్. ఇంటికి వచ్చిన సుట్టాలకు గుక్కెడు నీరు ఇవ్వలేకున్నాం. మా కష్టం అంతా ఇంతా కాదు. గ్రామానికి సమీపంలో విరుపాపురం ట్యాంకు ఉంది. మాకు పది రోజులకు ఒక్క సారి మంచినీళ్ల వదులుతారు. ఉన్న నీటిని పొదుపుగా వాడుకుంటున్నాం.

– గౌరమ్మ, నిట్రవట్టి గ్రామం

చెలమ నీరే దిక్కు



మా గ్రామానికి బాపురం నుంచి నీళ్ల వస్తాయి. గ్రామంలో ఇంతమంది ఉన్నా నీళ్ల రాలేదని ఎవ్వరూ అడగరు. వారానికి కూడా సరిగా రావు. గ్రామ సమీపంలో ఉండే వంకలో చెలమ నీరే మాకు దిక్కు. మా కష్టాలు అన్నీ ఇన్నీ కావు.

– శేషమ్మ, సిద్ధాపురం

క్లుప్తంగా

రైలు నుంచి జారి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



బేతంచెర్ల: డోన్ - నంద్యాల రైల్వే మార్గంలో ప్రమాద వశాత్తూ గుర్తు తెలియని వ్యక్తి రైలులో నుంచి కింద పడి మృతి చెందాడు. నంద్యాల రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఖలీల్ అహ్మద్ తెలిపిన వివరాల మేరకు.. సిమెంట్ నగర్ గ్రామం - కృష్ణమ్మ కోన రైల్వే స్టేషన్ మధ్యన శనివారం ఉదయం సుమారు 55 ఏళ్ల వయస్సు ఉండి స్కై బ్లూ కలర్ షర్టు ధరించిన ఓ వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. రైలు నుంచి జారి పడి తీవ్రంగా గాయపడటంతో మృతి చెందినట్లు తెలుస్తుందన్నారు. శుక్రవారం రాత్రి తుగ్గలి రైల్వే స్టేషన్ నుంచి డోన్ వరకు టికెట్ కొనుగోలు చేసినట్లు టికెట్ లభించిందని, ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కదిరి వాసి దుర్మరణం



మృతి చెందిన శంకర్

ప్యాపిలి: కర్నూలు - బెంగళూరు జాతీయ రహదారిపై ఏనుగుమర్రి గ్రామ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతపురం జిల్లా కదిరి వాసి దుర్మరణం చెందాడు. చిత్తూరు జిల్లా మదనపల్లి నుంచి నాగ్‌పూర్ పట్టణానికి టమాట లోడ్‌తో లారీ బయలుదేరింది. మార్గమధ్యలో ఏనుగుమర్రి వద్ద ముందు వెళ్తున్న లారీని అధిగమించబోయి ప్రమాదవశాత్తూ ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో లారీ క్యాబిన్‌లో ఉన్న శంకర్, సురేష్‌కు తీవ్ర గాయాలు కాగా లారీ డ్రైవర్ రసూల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన శంకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు శంకర్ కదిరి పట్టణం కోటవీధి నివాసి అని తెలిసింది. మృతుడికి భార్య అనిత, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ప్యాపిలి పోలీసులు తెలిపారు.

కృష్ణానదిలో 12 కిలోల చేప



నందికొట్కూరు: సంకిరేణిపల్లె గ్రామ సమీపంలో కృష్ణానదిలో 12 కిలోల చేప మత్స్యకారుడు నరసింహులు వేసిన వలలో శనివారం చిక్కింది. బొచ్చా రకానికి చేపను కిలో రూ. 150లు చొప్పున అదే గ్రామానికి చెందిన అల్లుడ్లా కొనుగోలు చేశారు.

ఆశా వర్కర్ల ఘర్షణ

జూపాడుబంగ్లా: తూడిచెర్ల హెల్త్ సబ్‌సెంటర్‌లో శనివారం ఉదయం ఇద్దరు ఆశావర్కర్లు ఘర్షణ పడ్డారు. ఆరోగ్య ఉప కేంద్రంలో కసువు చిమ్మే విషయంలో జయమ్మ, బాలమ్మ అనే ఆశావర్కర్ల మధ్య మాటామాటా పెరిగింది. పరస్పరం దూషించుకోవటంతో పాటు ఇద్దరూ జుట్టు పట్టుకుని కొట్టుకున్నారు. బాలమ్మ తన సెల్‌ఫోన్‌ను విసిరికొట్టడంతో జయమ్మ కుడిచెవికి తగిలి చెవిలోంచి రక్తస్రావమైంది. వెంటనే 108లో కర్నూలు పెద్దాసుపత్రికి తరలించారు. ఘర్షణపై ఆశా వర్కర్లు ఇద్దరూ ఫిర్యాదు చేశారని ఏఎస్‌ఐ మేరీ జయంతి తెలిపారు.



నల్లమల మధ్య రహదారి మలుపులు

వందల ఏళ్లైనా చెక్కు చెదరని దొరబావి వంతెన గోడలు

పచ్చటి పందిరిలా నల్లమలలోని రహదారి

వందల అడుగుల లోతులో నల్లమల రైలుమార్గం



ప్రకృతి అందాల మధ్య నల్లమలలో ప్రయాణ మార్గం

నల్లమల సొగసు చూడ తరమా!

ప్రకృతి కాంత ఆకుపచ్చని చీర కట్టినట్లుగా నల్లమల అడవి కళకళలాడుతోంది. కనుచూపు మేర పచ్చని అందాలు ప్రకృతి ప్రేమికులను కట్టిపడేస్తున్నాయి. అందాలకు నెలవైన నల్లమల ఇటీవల కురిసిన వర్షాలతో పచ్చటి అందాలతో పర్యాటకుల మదిని దోచేస్తోంది. ఒంపుసొంపులు (మలుపులు) తిరిగిన రహదారులు, దాదాపు 400 అడుగుల లోతులో ఆనాటి రైలు మార్గంలో ప్రయాణం, వందల ఏళ్లు గడిచినా చెక్కు చెదరని దొరబావి వంతెన శిథిలాలు...ఇలా ప్రతీది ఓ దృశ్య కావ్యమే. నల్లమల మీదుగా వాహనాలు, రైలులో ప్రయాణించే ప్రయాణికులను అడవి అందాలను ఆస్వాదిస్తూ.. 'ఆకులో ఆకునై, పూవులో పూవునై నునులేత రెమ్మనై ఈ అడవి దాగిపోనా.. ఎటులైనా ఇచటనే ఆగిపోనా' అంటూ నాటి మేఘ సందేశం చిత్రంలో దేవులపల్లి కృష్ణశాస్త్రి రాసిన ఈ పాటను వల్లెవేస్తున్నారు. – మహానంది

ఎమ్మిగనూరులో హెల్మెట్ దొంగలు

- పాలవ్యాపారిని బెదిరించి బంగారు ఉంగరాల దోపిడీ
- శివారు సర్కిళ్లలో మకాం

ఎమ్మిగనూరు: దొంగలు కొత్త పంథాను ఎంచుకున్నారు. హెల్మెట్లు ధరించి దారిదోపిడీలకు పాల్పడుతున్నారు. ఎమ్మిగనూరులో పాలవ్యాపారి చేతి బంగారు ఉంగరాలను లాక్కెళ్లారు. ఈ ఘటన శనివారం ఆలస్యంగా వెలుగు చూసింది. పట్టణానికి చెందిన కోటిరెడ్డి అనే రైతు పాడిగేదెలను పోషిస్తూ పాలవ్యాపారం చేస్తున్నాడు. గురువారం రాత్రి 7 గంటల ప్రాంతంలో గూడూరు-కర్నూలు రోడ్డులో లెదర్‌సొసైటీ దగ్గర ఆయన గేదెలను మేపుతూ ప్రధాన రహదారిపై ఉన్నాడు. ఎమ్మిగనూరు నుంచి హెల్మెట్లు ధరించి మోటారు బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు కత్తులు చూపించి కోటిరెడ్డిని బెదించారు. ప్రాణాపాయంతో కోటిరెడ్డి చేతికున్న బంగారు ఉంగరాలను, నగదును తీసివ్వటంతో దుండగులు కలుగొట్ల వైపు బైక్‌పై వెళ్లారు. జరిగిన విషయాన్ని కోటిరెడ్డి కుటుంబ సభ్యులకు తెలిపినా దొంగలతో మనకెందుకులే అంటూ మిన్నకుండిపోయారు. ఇదిలా ఉండగా.. ఒంటరిగా వస్తున్నవారిని, నగలు ధరించిన వారిని గుర్తించి కత్తులు చూపి బెదిరించి దారి దోపిడీలు చేయటంలో హెల్మెట్ దొంగలు ఆరితేరినట్లు పట్టణంలో చర్చ నడుస్తోంది. కోసిగిరోడ్డు, ఆదోనిరోడ్డు, ఎల్‌ఎల్‌సీపై, కర్నూలు రోడ్డులో బీఎడ్ కళాశాల వంటి శివారు సర్కిళ్లలో దోపిడీదారులు రెక్కీ నిర్వహిస్తుంటారని ప్రజలు చర్చించుకుంటున్నారు. హెల్మెట్ దొంగల బెడద నుంచి ప్రజలను పోలీసులు కాపాడాల్సి ఉంది.

జల్సాల కోసమే క్యాబ్ చోరీ!

- దొంగను అరెస్ట్ చేసిన పోలీసులు



అపహరించిన క్యాబ్‌ను స్వాధీనం చేసుకుని నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

ఎమ్మిగనూరురూరల్: జల్సాలకు అలవాటు పడి కర్ణాటక రాష్ట్రం బాగల్‌కోట్ జిల్లా ముతోల్ నియోజకవర్గం మాలాపూర్, శిరోవర్ గ్రామాలకు చెందిన అనిల్‌బిరాదర్, సంతోష్‌హుట్టిలు క్యాబ్ చోరీ చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. వీరిలో అనిల్‌బిరాదర్‌ను పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. సీఐ బీవీ విక్రమసింహ తెలిపిన వివరాల మేరకు.. హైదరాబాద్‌లో ఈ నెల 5న కాచిగూడ నుంచి మంత్రాలయాని వెళ్లాలని వీరు ఉబర్ యాప్ ద్వారా కారును బుక్ చేసుకున్నారు. అదే రోజు రాత్రి 10.50 గంటలకు వికారాబాద్ జిల్లా దోమ మండలం కొడాయిపల్లి గ్రామానికి డ్రైవర్ నిమ్మలి ప్రసాద్ క్యాబ్‌ను తీసుకొని కాచిగూడ రైల్వే స్టేషన్‌కు వెళ్లాడు. క్యాబ్‌లో రాయచూర్ మీదుగా మంత్రాలయానికి 6వ తేదీ తెల్లవారుజామున 5.30 గంటలకు చేరుకున్నారు. ఎమ్మిగనూరు వైపు టోల్‌గేట్ దగ్గర తమ స్నేహితుడి షెడ్ ఉందని.. అక్కడ స్నానాలు చేస్తామని డ్రైవర్‌కు చెప్పడంతో ఆయన సరే అన్నారు. కారులో ఎమ్మిగనూరుకు వెళ్తుండగా నందవరం మండలం హాలహర్వి గ్రామ సమీపంలో పొలాలకు వెళ్లే కాలువ కట్టవైపు కారును వెళ్లమన్నారు. కొంత దూరం వెళ్లాక కారును నిలపమని చెప్పి డ్రైవర్‌కు అనుమానం రాకుండా ఇద్దరు దొంగలు తమ బ్యాగ్‌లు తీసుకొని స్నానం చేసి వస్తామని చెప్పి వెళ్లారు. డ్రైవర్ కారులో నిద్రపోవడంతో అతని ముఖానికి మత్తమందు స్ప్రే చేశారు. దీంతో మెలకువ వచ్చిన డ్రైవర్ కేకలు వేయటంతో ఇద్దరు యువకులు పట్టుకొని దాడి చేశారు. చంపేస్తారేమోనని భయంతో వారి నుంచి తప్పించుకొని రోడ్డువైపు పరిగెత్తి వచ్చాడు. కారును ఇద్దరు యువకులు దొంగలించుకెళ్లారు. డ్రైవర్ మంత్రాలయం పోలీసులకు విషయం చెప్పడంతో నందవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వెంటనే రూరల్ సీఐ బీవీ విక్రమసింహ..ఎస్‌ఐ తిమ్మయ్య, ఏఎస్‌ఐ ఆనంద్, పీసీలు మల్లికార్జున, సుధాకర్, మల్లేష్, హనుమంతులను అప్రమత్తం చేశారు. డ్రైవర్ వద్ద యువకుల్లో ఒకరి సెల్‌ఫోన్ నంబర్ ఉండటంతో సెల్ సిగ్నల్, సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి.. కర్నాటక రాష్ట్రం గిలకసూగర్ దగ్గర ఉన్నట్లు గుర్తించారు. వెంటనే అక్కడి వెళ్లి అనిల్‌బిరాదర్‌ను అరెస్ట్ చేసి, మంత్రాలయం మండలం మాధవరం దగ్గర దాచిన క్యాబ్‌ను స్వాధీనం చేసుకున్నారు. మరో దొంగ సంతోష్‌హుట్టి పరారీలో ఉన్నాడని తర్వలో అరెస్ట్ చేస్తామని సీఐ చెప్పారు.

పదోన్నతులకు ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడి మోకాలడ్డు

- సోషల్ మీడియాలో వీఆర్వోల సంభాషణ వైరల్

కర్నూలు సెంట్రల్: గ్రేడ్-1 వీఆర్వోల పదోన్నతికి ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు వి.గిరి కు మార్‌రెడ్డి అడ్డంకిగా మారినట్లు వీఆర్వోల సంభాషణ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కలెక్టరేట్‌లోని ఏ-సెక్షన్ లో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులతో ఆయన కుమ్మక్కై వీఆర్వోల పదోన్నతి ఫైల్‌ను ముందుకు కదలనీయడం లేదని కొందరు వీఆర్వోలు ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర నాయకులకు జూమ్ మీటింగ్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన ఏకపక్షంగా వ్యవహరిస్తూ కేవలం తమను సంఘం పనులకు మా త్రమే వాడుకుంటున్నారని.. తమ పదోన్నతులు, బదిలీలపై ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పదోన్నతి అంశాలపై కలెక్టర్ను కలిసి విన్నవించాలని కోరినా పట్టించుకోవడంలేదని, ఇందుకు ఆయన జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులతో కుమ్మక్కు కావడమే కారణమని సంభాషిస్తున్నట్లు వీడియో వైరల్ అవుతోంది. ఇదిలాఉంటే వీఆర్వోలకు, సీనియర్ అసిస్టెంట్లకు పదోన్నతి ఇస్తే.. తమకు పదోన్నతులు రావని జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టుల వాదన. అయితే పదోన్నతులను సర్వీస్ ఆధారంగా ఇవ్వనుండటం కొసమెరుపు.

బదిలీల్లో దివ్యాంగ ఉద్యోగులను ఇబ్బంది పెట్టొద్దు

- జిల్లా అధ్యక్షులు ఎం శివారెడ్డి



సమావేశంలో జిల్లా దివ్యాంగ ఉద్యోగుల సంఘం నాయకులు

కర్నూలు(అర్బన్): దివ్యాంగ ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేయకుండా వారు కోరుకున్న ప్రాంతాలకు ప్రభుత్వం బదిలీ చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం శివారెడ్డి కోరారు. శనివారం స్థానిక బీ క్యాంప్‌లోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులకు రంగుల సదరం సర్టిఫికెట్స్ కాకుండా పాత వాటినే ఇవ్వాలన్నారు. దివ్యాంగ ఉద్యోగులు ప్రతి ఒక్కరూ యుడీ ఐడీ కార్డులు పొందాలన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనానికి వెళ్లే వారికి గతంలో ఉన్న విధంగానే రోజువారీ దర్శనం కల్పించాలని, గదులు కూడా దేవాలయానికి సమీపంలో ఉండేలా ఇవ్వాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ర్యాంపు సౌకర్యం కల్పించాలన్నారు. ఎక్కడ ఎవరికి ఎలాంటి సమస్య ఎదురైనా సంఘాన్ని సంప్రదించాలని కోరారు. సమావేశంలో కార్యదర్శి కే కృష్ణుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శి సీ హనుమంతప్ప, సంయుక్త కార్యదర్శి ఎం శ్రావణ్‌కుమార్, కోశాధికారి యు సాంబశివరావు, నాయకులు శివయ్య, రంగస్వామి, శ్రీనివాసులు, ఈ ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

బైక్ రైడింగ్స్‌పై 7777877722కు ఫిర్యాదు చేయండి



మాట్లాడుతున్న ఎస్పీ బిందు మాధవ్

కర్నూలు: బైక్ రైడింగ్స్, ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్లు తొలగించి ఎక్కువ శబ్దాలు చేస్తూ వెళ్లే వ్యక్తులు, యువకుల వీడియో తీసి కర్నూలు పోలీస్ వాట్సాప్ నెంబర్ 7777877722కు సమాచారమివ్వాలని ఎస్పీ బిందు మాధవ్ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పాఠశాలలు, కళాశాలల వద్ద ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయా యాజమాన్యాలతో డీపీఓలోని వ్యాస్ ఆడిటోరియంలో ఎస్పీ ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించి సూచనలు చేశారు. అధిక శబ్దం చేసే బైక్ సైలెన్సర్లను బిగించవద్దని బైక్ మెకానిక్‌లకు సూచించారు. ర్యాగింగ్, ఈవ్ టీజింగ్‌లకు పాల్పడుతూ ఆకతాయిల నుంచి ఎదురయ్యే సమస్యలను పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు ఎస్పీకి విన్నవించారు. అలాంటి ఆకతాయిలపై ప్రత్యేక దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. డీఎస్పీ బాబు ప్రసాద్, రెండవ పట్టణ సీఐ నాగరాజరావుతో పాటు 14 ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు, పాఠశాలల నిర్వాహకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తల హల్‌చల్

- యాత్రికులు, ఫారెస్ట్ ప్రొటెక్షన్ వాచర్లపై దాడి

శ్రీశైలంప్రాజెక్ట్: లింగాలగట్టు పెద్ద బ్రిడ్జి వద్ద శుక్రవారం రాత్రి 11:30 గంటల సమయంలో టీడీపీ కార్యకర్తలు హల్‌చల్ చేశారు. 10 మంది టీడీపీ కార్యకర్తలు యాత్రికులు, ఫారెస్ట్ ప్రొటెక్షన్ వాచర్లపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన వివరాలను ఫారెస్ట్ రేంజ్ అధికారి నరసింహులు వివరించారు. ముందుగా హైదరాబాద్‌కు చెందిన యాత్రికులు, స్థానిక టీడీపీ కార్యకర్తలకు మాయాబజార్ ప్రాంతంలో చిన్న పాటి గొడవ జరిగింది. అనంతరం టీడీపీ కార్యకర్తలు లింగాలగట్టు ఫారెస్ట్ చెక్‌పోస్టు వద్ద కాపుకాసి హైదరాబాద్‌కు చెందిన వారిని కారు దింపి దాడికి పాల్పడ్డారు. అక్కడనే విధి నిర్వహణలో ఉన్న ప్రొటెక్షన్ వాచర్లు కోటి, శివకృష్ణ, కరుణాకర్, యోబులు అడ్డుకున్నారు. అయితే వారిపై కూడా టీడీపీ కార్యకర్తలు దాడి చేశారు. ఈ ఘటనపై టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రేంజ్ అధికారి నరసింహులు తెలిపారు.

పోలీసుల అదుపులో 'కొమ్ము'

- పేకాట శిబిరంపై పోలీసుల దాడి
- మిద్దె పైనుంచి దూకడంతో ఒకరికి గాయాలు
- రహస్యంగా ఆసుపత్రిలో వైద్యచికిత్స

కర్నూలు: నగర శివారులోని ఎన్‌టీఆర్ బిల్డింగ్స్‌లో ఓ ఇంట్లో జోరుగా పేకాట జరుగుతున్నట్లు సమాచారం అందడంతో నాల్గవ పట్టణ పోలీసులు శనివారం సాయంత్రం దాడి చేశారు. నిర్వాహకుడు రవిశంకర్ అలియాస్ 'కొమ్ము' రవితో పాటు కర్నూలుకు చెందిన శేఖర్, రమేష్, రాజేష్, సుబ్బయ్య, గురుప్రతాప్, మాసూం, ఈరన్న, అంజి తదితరులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కొమ్ము రవి తన ఇంట్లోనే పేకాట నిర్వహిస్తుండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం చేరవేశారు. అతని ఇంటిని పోలీసులు చుట్టుముట్టగానే కొమ్ము రవి అనుచరుడు బంగారుపేటకు చెందిన సురేష్ మిద్దె పైనుంచి కిందికి దూకడంతో తీవ్ర గాయాలకు గురయ్యాడు. కాళ్లు, చేతులకు గాయాలై సొమ్మసిల్లి పడిపోవడంతో పోలీసులు అప్రమత్తమై ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించి చికిత్సలు చేయిస్తున్నారు. అయితే ఈ విషయంపై నాల్గవ పట్టణ పోలీసులను వివరణ కోరగా ఎన్‌టీఆర్ బిల్డింగ్స్ శివారులోని ముళ్ల పొదల్లో పేకాట జరుగుతున్నట్లు సమాచారం అందడంతో దాడులు జరిపి నిర్వాహకుడు కొమ్ము రవితో పాటు ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి దాదాపు రూ.లక్ష స్వాధీనం చేసుకోగా రూ.70,200 స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు కేసు నమోదు చేశారు.

కొణిదెల పేరుతో వాట్సాప్ గ్రూప్‌లు...

కొణిదెల పేరుతో వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేసి నిర్వాహకుడు కర్నూలులో రహస్యంగా జూద శిబిరం నిర్వహిస్తున్నాడు. వందల మంది పేకాటరాయుళ్లను ఈ గ్రూపుల్లో సభ్యులుగా చేర్చి నిర్దేశించుకున్న స్థలానికి అనుకున్న సమయానికి పేకాటరాయుళ్లు చేరుకునేలా సమాచారం చేరవేస్తున్నట్లు విచారణలో బయటపడింది.

చీర కట్టిన చేను

ఈ చిత్రం కర్నూలు సమీపంలోని గార్గేయపురం పరిధిలోనిది. ఐటీసీ కంపెనీ పొగాకు విత్తనాలను రైతుకు ఇవ్వడంతో నారు వేశారు. పందులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉండటంతో నారు చుట్టూ చీరలను కంచెగా కట్టారు. దారిలో పోయే వారు చీరల చాటున ఉన్న పంటను చూస్తూ వెళుతున్నారు.

– సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు

